క్లుప్తంగా

కీలక తీర్మానాలకు ఆమోదం



మాట్లాడుతున్న ట్రస్టుబోర్డు చైర్మన్ కొండబాబు

సీటీఆర్ఐ: గౌతమీ జీవకారుణ్య సంఘం ధర్మకర్తల మండలి సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఆమోదించినట్టు ట్రస్టుబోర్డు చైర్మన్ బర్రే కొండబాబు తెలిపారు. స్థానిక గౌతమీ జీవ కారుణ్య సంఘం సమావేశం మందిరంలో శుక్రవారం ట్రస్టుబోర్డు తొలి సమావేశం జరిగింది. చైర్మన్ కొండబాబు మాట్లాడుతూ సంఘం ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల లీజు, బకాయి సొమ్ము వసూలు, లాయర్‌ని నియమించడం, సంపత్ విజయ గణపతి దేవస్థానంలో పర్వదినాలలో వివిధ రకాలైన టికెట్లు ఏర్పాటు చేయటం వంటి తీర్మానాలను ఆమోదించారు. ఇక్కడ ఉన్న వృద్ధులకు బ్యాంక్ ఖాతాలు తెరవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గౌతమీ జీవకారుణ్య సంఘం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిణి కె.విజయ లక్ష్మి, టస్టు సభ్యులు పాల్గొన్నారు.

నండూరి వెంకట రమణకు నివాళి



మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్గీయ మాజీ కార్పొరేటర్, ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు నండూరి వెంకట రమణ (కేబుల్ రమణ) సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక సీతంపేట పార్క్ వద్ద కేబుల్ రమణ మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం నండూరి వెంకట రమణ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీసీసీ ఎండీ, మాజీ కార్పొరేటర్ పంతం కొండలరావు మాట్లాడుతూ రమణ మాయగా గుర్తింపు తెచ్చుకున్న రమణ మృతి బాధకరమన్నారు. మాజీ కార్పొరేటర్లు గూడూరి రాధిక, పోలు విజయలక్ష్మి, ప్రసాదుల హరినాథ్, కరగాని వేణు, మానే దొరబాబు, వాకచర్ల కృష్ణ, ఏవీ రమణ, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, పార్టీ నాయకులు దూర్వాసుల సత్యనారాయణ, కేఏఎల్ఎన్ రెడ్డి, డీవీ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల స్వచ్ఛభారత్

కంబాలచెరువు: ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. పాఠశాల కోఆర్డినేటర్ బి.విజయకుమారి, సభ్యుడు వరహాగిరి కృష్ణ మోహన్ పాల్గొని రెడ్‌క్రాస్ లక్ష్యాలు, ఆశయాలను తెలిపారు.

ఘనంగా వనమహోత్సవం

కంబాలచెరువు: ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వ్యవసాయ కళాశాలలో వనమహోత్సవం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజ్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేప, వెదురు, మామిడి, అల్ల నేరెడు, మారెడు మొక్కలను నాటి, వాటివల్ల కలిగే లాభాలను వివరించారు. కళాశాల ప్రాంగణంలో వసుధ వాటికను తయారు చేశారు. విద్యార్థులతో పంచప్రాణ్ ప్రతిజ్ఞను చేయించి, అమర వీర జవాన్లను నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ రమేష్, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ మాధవి, డాక్టర్ అనురాధ, డాక్టర్ ఓంకర్, డాక్టర్ విజయ శంకర్ పాల్గొన్నారు.

టీడీపీ పోస్టర్ల పంపిణీ

కడియం: టీడీపీ మహాశక్తి కార్యక్రమంలో భాగంగా కడియంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు పోస్టర్లను పంపిణీ చేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, పార్టీ నాయకులు మజ్జి పద్మ, వెలుగుబంటి రఘురామ్, పిల్లి తనూజ పాల్గొన్నారు.

పల్మనాలజీకి ఎంతో ప్రాధాన్యం

రాజానగరం: డిప్లమా కోర్సుగా ప్రారంభమైన పల్మనాలజీ/రెస్పిరేటరీ మెడిసిన్ నేడు సూపర్ స్పెషాలిటీ, సబ్ స్పెషాలిటీ కోర్సుల వరకు విస్తరించిందని, దీని ప్రాధాన్యత కోవిడ్ సమయంలో ప్రపంచానికి తెలిసిందని అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్టు సీమాంధ్ర (ఏపీఏస్ఏ) ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ అన్నారు. శ్వాస, ఊపిరితిత్తుల అనారోగ్యాల ధోరణులను, పరిష్కారాలను చర్చించే రాష్ట్ర స్థాయి పల్మనాలజిస్టుల సదస్సు స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో శుక్రవారం ప్రారంభమైంది. ఏపీఎస్ఏ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది పల్మనాలజీ వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొంటున్నారని ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. సైంటిఫిక్ పేపర్లు, పోస్టర్లు, సెమినార్లు, కొత్త పరికరాలపై శిక్షణ ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.రాజేంద్ర కుమార్ అన్నారు.

కూచిపూడి మహాయజ్ఞం



లక్ష్మీదీపిక నృత్యం

- ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో నృత్యనీరాజనం
- 63 రోజుల పాటు 22 రాష్ట్రాల్లో యాత్ర
- శ్రీకారం చుట్టిన రాధాకృష్ణ కళాక్షేత్రం



అయినవిల్లి వినాయక దేవాలయంలో నృత్య ప్రదర్శన



కలెక్టర్ మాధవీలతకు మెమెంటో ఇస్తున్న లక్ష్మీదీపిక

సీటీఆర్ఐ: కూచిపూడి నృత్యాన్ని నేటితరం తెలుసుకోవాలనే సంకల్పంతో మహాయజ్ఞానానికి శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం నిర్వాహకుడు జీబీ నారాయణ శ్రీకారం చుట్టారు. భారతదేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించడం, తద్వారా కూచిపూడికి పూర్వ వైభవం తీసుకుని రావడానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 17 వేల కిలోమీటర్లు, 22 రాష్ట్రాలలోని ప్రసిద్ధ పుణ్యదేవాలయాల సందర్శన, నిర్విరామంగా 63 రోజులు పాటు తన శిష్యబృందంతో కూచిపూడి నాట్యం ప్రదర్శనకు శుక్రవారం నాంది పలికారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం వేదికైంది. అయినవిల్లి, మహానంది, శ్రీశైలం, విజయవాడ, అన్నవరం, సింహాచలం, బాసర, వేముల వాడ, యాదగిరి గుట్ట, భద్రకాళీ గుడి, భద్రాచలం, పూరి జగన్నాథ్, కాళీఘాట్, సూర్యానారాయణ దేవాలయం, శక్తిపీఠం, వారణాసి, కేదార్‌నాథ్, జ్వాలాదేవీ, వైష్ణవీ దేవాలయం, అమృత్‌సర్, కార్తికేయ టెంపుల్, బృందావనం, ఉదయపూర్, పశుపతినాథ్ ఆలయం, షిరిడీ, మంత్రాలయం, తిరువనంతపురం, కన్యాకుమారి, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాల్లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించనున్నారు.

బస్సులో ప్రయాణం

నృత్య కళాకారులు, కోఆర్డినేటర్లు, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం బృందం బస్సులో సుదీర్ఘ ప్రయాణం చేస్తూ దేవాలయాలలో నృత్య ప్రదర్శనలు చేస్తారు. వీరి కంటే ముందుగా ఒక టీమ్ వెళ్లి అక్కడ బస చేయడానికి, ఉండడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. కళాకారులు వచ్చే సమయానికి వారికి ఏలోటూ లేకుండా చూస్తుంది. కానీ బస్సులో అంత దూరం ప్రయాణించి వెంటనే అక్కడ నాట్య ప్రదర్శన ఇవ్వడమనేది చాలా కష్టం. అయినా నేటి తరానికి మన సంస్కృతి, సంప్రదాయాలు అందించాలనే ధృడ సంకల్పం ముందు ఈ కష్టాలు ఏపాటివి అంటూ శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం నిర్వాహకుడు జీబీ నారాయణ అంటున్నారు. ఈ బృహత్తు కార్యక్రమంలో ఆయన సతీమణి జి.ఉమాజయశ్రీ, ఆయన కుమార్తె జి.లక్ష్మీ దీపిక సహయ సహకారాలు మరవలేనవిన్నారు.

63 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

63 రోజుల పాటు సంపూర్ణ భారతదేశ యాత్రను రాజమహేంద్రవరం నుంచి ప్రారంభించిన సందర్భంగా 63 అడుగుల జాతీయ జెండాను కలెక్టర్ మాధవీలత చేతులు మీదుగా ఆవిష్కరించారు.

స్వాగతం..



వైఎస్సార్ సున్నావడ్డీ పథకం ప్రారంభోత్సవానికి అమలాపురం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

యూత్ రెడ్‌క్రాస్ సదస్సు

కంబాలచెరువు: స్థానిక ఆదిత్యా డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలలో శుక్రవారం యూత్ రెడ్ క్రాస్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యూత్ రెడ్ క్రాస్ మేనేజ్ మెంట్ కౌన్సెలింగ్ మెంబర్ డాక్టర్ జీఎన్‌వీబీఎస్ మహాలక్ష్మి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రిన్సిపల్ ఎస్‌ఎన్‌కే రెహమాన్, డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌పీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల దత్తత అభినందనీయం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- రాజవోలులో చెత్త సేకరణ వాహనాల ప్రారంభం



రాజవోలులో చెత్త సేకరణ వాహనాలను ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: హిందుస్థాన్ యునీలివర్ లిమిటెడ్ (హార్లిక్స్ ఫ్యాక్టరీ) యాజమాన్యం సీఎస్ఆర్ ద్వారా గ్రామాలను దత్తత తీసుకోవడం అభిందనీయమని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం రాజవోలు గ్రామంలో మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాం బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హిందుస్థాన్ యునీలివర్ లిమిటెడ్ యాజమాన్యం చేపట్టిన ప్రభాత్ వ్యర్థాల నిర్వహణ యార్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధవళేశ్వరం, రాజవోలు గ్రామాలను దత్తత తీసుకుని, వ్యర్థ పదార్థాల నిర్వహణ కార్యక్రమాలను చేపట్టి అమలు చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పెద్ద ఎత్తున సాలిడ్ వేస్టు మేనేజ్ మెంట్ ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. దీనికి తోడు ప్రజలు, పరిశ్రమల భాగస్వామ్యం ఉంటే మరిన్ని ఫలితాలు వస్తాయన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేసే రెండు వాహనాలను ఆయన ప్రారంభించారు. చెత్త వేసుకునేందుకు మహిళలకు డస్టబిన్లు అందించారు. ఇంప్లిమింటేషన్ పార్టనర్ హెల్ప్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధులు ప్రభాత్ వ్యర్థాల నిర్వహణ యార్డ్ పనితీరును వివరించారు.

రేషన్ కార్డుల పంపిణీ

రాజవోలు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇటీవల దరఖాస్తు చేసుకున్న 28 మందికి కొత్త రేషన్‌కార్డులను చందన నాగేశ్వర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల జిల్లా కో ఆర్డినేటర్ ఆరమ్ స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్, సచివాలయ సెక్రటరీ ఏ.హాసిని, సచివాలయ ఉద్యోగులు, పార్టీనాయకులు సింహాద్రి రామలక్ష్మి, బూసి కృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు 'సీడ్ టు సీడ్' కిట్ల పంపిణీ



దళిత రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: రైతు సాధికార సంస్థ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకృతి సాగుచేసే రైతులకు శుక్రవారం సీడ్ టు సీడ్ కిట్లను పంపిణీ చేశారు. దుళ్ల సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే దళిత రైతులను ప్రోత్సహించేందుకు ఈ కిట్లను పంపిణీ చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వీటిని చూసి తట్టుకోలేని ప్రతిపక్షాలు పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అయితే ఆ ఆరోపణలు చేసేవారికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రూరల్‌లో వైఎస్సార్ సీపీ పార్టీని గెలిపించుకునేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తాతపూడి బాబీ, కొండపల్లి నాని, కంటిపూడి సాయి, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి బి.సరోజారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మణ్, సూర్యకుమారి, సుహాసిని, వేణి తదితరులు పాల్గొన్నారు.

సైనికులను సన్మానించుకోవడం అదృష్టం



ఆర్మీ విశ్రాంత సుబేదారు వరహాలరావును సత్కరిస్తున్న డీన్ శ్యామ్‌రాజ్ నాయక్

రాజమహేంద్రవరం రూరల్: దేశ భద్రత కోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న సైనికులను సన్మానించుకోవడం మన అదృష్టమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్ రాజ్ నాయక్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నాభూమి –నాదేశం కార్యక్రమాన్ని జాతీయసేవా పథకం ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇండియన్ ఆర్మీ సుబేదారు వరహాలరావును ఘనంగా సన్మానించారు. వరహాలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను అలవర్చుకోవాలని, అప్పుడే జీవితంలో మంచిస్థాయికి చేరగలమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజవోలులో.. ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించే గుణాన్ని కలిగి ఉండాలని ఇండియన్ ఆర్మీ మాజీ హవల్దార్ బండి ఆదామ్ రాజు సూచించారు. రాజవోలులోని కోనేరు వద్ద శుక్రవారం నా భూమి – నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఆదామ్ రాజు చేతుల మీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, దీపాలు వెలిగించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పంచాయతీ కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్, సచివాలయ సెక్రటరీ ఏ.హాసిని పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్ ఆవరణలోని నేక్ భవనంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 67 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మూడు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 33 మందికి ఉద్యోగాలు కల్పించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు మాట్లాడుతూ జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ (నాక్) జున్నూరి రాజు, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు రాయితీలు

మధురపూడి: ఉద్యానవనాల విస్తృతి, రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించిందని ఆ శాఖ కోరుకొండ మండలాధికారి రినీ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండ, సీతానగరం మండలాల్లో పండిస్తున్న శనగలు, మిర్చి, చింతపండు తదితర వాటిని నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రైతులకు 75 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. రైతులు సంఘంగా ఏర్పడి దీన్ని దక్కించుకోవాలన్నారు. కోల్డ్ స్టోరేజీ యూనిట్‌కు రూ.15 లక్షలు ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న 75 శాతం సబ్సిడీతో రైతు సంఘాలు రూ.3,75,000 చెల్లించాలన్నారు. పండ్ల తోటలకు సాగునీరందించే నల్ల పైపులను ఏపీఎంఐపీ ద్వారా 50 శాతం సబ్సిడీకి పొందవచ్చన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లకు 90 శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. పొలం గట్లపై వేసుకునేందుకు కొబ్బరి మొక్కలను రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. హైబ్రీడ్ కొబ్బరి మొక్కలను 50 శాతం సబ్సిడీతో పొందవచ్చన్నారు. వీటిని పశ్చిమగోదావరి జిల్లా వేగిమూడి నుంచి తీసుకోవాలన్నారు. మొక్కలను తెచ్చుకున్న అనంతరం ఆ బిల్లు ఆధారంగా సబ్సిడీని ఉద్యాన వన శాఖ ద్వారా పొందవచ్చన్నారు. పండ్లతోటల రైతులు ప్రాథమికంగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

ఏపీ ఎన్జీవో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎన్జీవో హోం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇచ్చినందున ఈనెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులను పంపాలని ఎన్జీవో ప్రతినిధులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. కోటగుమ్మం సెంటర్‌లోని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో డీఈవో అబ్రహం, రహదారులు, భవనాలశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయంలో ఈఈ శ్రీకాంత్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర ఎన్జీవో సంఘ అధ్యక్షులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్ జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్, నాయకులు అనిల్ కుమార్, ఎం.మాధవరావు, ప్రతాప్ సత్యమూర్తి, శ్రీనివాసరావు, మాలిక్, కామేశ్వరి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలి



క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మార్కెటింగ్ అధికారి వినయ్ సునీల్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రతి ఒక్కరూ ప్లాసిక్ వాడకాన్ని మానేసి, పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి ఎం.వినయ్ సునీల్ అన్నారు. స్థానిక గణేష్ చౌక్ రైతుబజార్‌లో కన్స్యూమర్ వాయిస్ ఆధ్వర్యంలో శుక్రవారం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినయ్ సునీల్ మాట్లాడుతూ రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీ ప్రారంభం



అకాడమీని ప్రారంభిస్తున్న ఉన్నత విద్యాశాఖ కమిషనర్ విజయ భాస్కర్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని ఎన్‌సీసీ బ్లాక్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీ (ఎఫ్‌డీఏ)ని ఏర్పాటు చేశారు. దీనిని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా విజయభాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల మధ్య ఉత్తమ అభ్యాసాలు, ఆవిష్కరణలు, మార్పిడిని సులభతరం చేయడానికి ఇటువంటి సంస్థ అవసరమన్నారు. కాలానుగుణంగా వచ్చే అవసరాలు తీర్చడానికి, నూతనంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా బోధనా సిబ్బందిని సంసిద్ధత చేయడానికి ఎఫ్‌డీఏ అవసరమవుతుందన్నారు. కళాశాల విద్యాశాఖ ద్వారా దీన్ని స్థాపించాలనే ఆలోచన చేసి ప్రారంభించామన్నారు. ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు చప్పిడి కృష్ణ మాట్లాడుతూ ఏకకాలంలో 60 మంది బోధనా సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి వీలుగా వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

ప్రకాశం నగర్: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కడియం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని పొట్టిలంక సచివాలయం 1 పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లు పంపిణీ చేశారు. స్థానికులు తెలిపిన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి, వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, కామిరెడ్డి రాంబాబు, నక్కా చంటిబాబు, వాస వీరభద్రరావు, గట్టి గంగాధర్, కర్రా ముక్తేశ్వరరావు, అంబటి రాజారత్నం, మత్సేటి శివ, కట్టా జమీందారు పాల్గొన్నారు.

మినిమల్ ఎక్సెస్ సర్జరీపై శిక్షణ



మాస్ ట్రైనింగ్ యూనిట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ

రాజానగరం: శరీరంపై వీలైనంత కోత/రంధ్రం పెట్టి చికిత్స చేసే మినిమల్ ఎక్సెస్ సర్జరీ (ఎంఏఎస్) విధానంపై మూడు రోజులు నిర్వహించే శిక్షణ శుక్రవారం స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఐఏజీఈఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినల్ ఎండో సర్జన్స్ (ఐఏజీఈఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.ఈశ్వర మూర్తి మాట్లాడుతూ కాలేజీలలో అందుకున్న డిగ్రీలతో పాటు వైద్యసేవలో అనుభవాలు, అవగాహనపై సదస్సులలో చర్చించి, పరీక్షలు నిర్వహించిన తరువాతనే యోగ్యత సాధించిన వారికి ఫెలోషిప్‌లు ప్రదానం చేస్తామన్నారు. ఈ శిక్షణకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు వంద మంది వరకు సర్జరీ పీజీ విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. ఈ బేసిక్ లాప్రోస్కోపీ, ఎగువ పేగులు, ఎండోస్కోపీ ప్రొసీజర్లు, కుట్లు వేయడంలో శిక్షణ ఉంటుందన్నారు. మాస్ ట్రైనింగ్ యూనిట్లను స్వయంగా పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ, జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, సర్జరీ హెడ్ డాక్టర్ సమీర్ రంజన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలో జాప్యంపై ఆగ్రహం

సీతానగరం: మండలంలో నలభై శాతం ఓటర్ల పరిశీలన జరగలేదని, ఇలా అయితే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం ఆర్డీవో, ఆర్‌వో చైత్రవర్షిణి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలు, సూపర్ వైజర్లతో సమీక్షించారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల విషయమై బీఎల్వోలకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు కనీస అవగాహన లేకపోవడంపై ఆమె అసహనానికి గురయ్యారు. జాబితాలో సవరణలు తప్పుల తడకలతో జరిగినట్లు గుర్తించారు. దానిపై వివరణ కోరంగా సరైన సమాధానం చెప్పకపోవడంతో చినకొండేపూడి వీఆర్వో, బీఎల్‌వో, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజుకు ఆదేశించారు. ఈనెల 21 నాటికి మండలంలో పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంపీడీవో కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి-సినిమా



శ్యామల :	జైలర్
సూర్యమినీ :	గదర్–2
సూర్యప్యాలెస్ :	భోళాశంకర్
స్వామి :	భోళాశంకర్
శివజ్యోతి :	భోళాశంకర్
అనుశ్రీ :	బ్రో
రాజా :	భోళాశంకర్
అశోక :	జైలర్
ఊర్వశి :	ఉస్తాద్
రంభ :	భోళాశంకర్
మేనక :	జైలర్
అప్సర :	బేబీ
నామవరం:	
వీఎస్.మహల్:	భోళాశంకర్
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	భోళాశంకర్
కడియం:	
వెంకటసూర్య:	భోళాశంకర్